క్లుప్తంగా

పట్టణాభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ డీఈ విక్టర్

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక పురపాలక సంఘానికి డీఈగా విక్టర్ బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఆదివారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధికి కృషి చేయాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఏఈ శరత్ తదితరులు ఉన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళమల్లేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం మాళమల్లేశ్వర స్వామి విరాట్‌మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు జలాభిషేకం, సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, భండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కొందరు భక్తులు సింహాసన కట్ట నుంచి కొండ పైనున్న ఆలయం వరకు మెట్టు మెట్టుకు దీపాలు వెలిగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

జయప్రదం చేయండి

నందవరం: ఈ నెల 28న విజయవాడలో జరిగే దళిత రక్షణ యాత్ర ధర్నాను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు దేవసహాయం, కరుణాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో దళిత రక్షణ యాత్రను జెండా ఊపి కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరకుంశ పాలన సాగుస్తుందని పేర్కొన్నారు. మణిపూర్ రాష్ట్రంలో జరిగిన అమానవీయ హత్యాచారాలు, దారుణ మారణకాండపై కేంద్రం, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించలేదన్నారు. ఆ విధానాలపై దళితులను చైతన్యం చేస్తూ ఈ నెల 22వ తేదీన నందవరం మండల కేంద్రంలో, 28వ తేదీన విజయవాడలో చేపట్టబోయే దళిత రక్షణ యాత్ర విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నాగలదిన్నెలో కేవీపీఎస్ జెండాను జిల్లా అధ్యక్షుడు ఆవిష్కరించారు. చర్మకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంథోని, డప్పు కళాకారుల సంఘం నాయకులు జయరాజు, కాటి కాపర్ల సంఘం నాయకులు రాజా రమేష్, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

హాలహర్వి: ఈనెల 18వ తేదీ నుంచి జరిగే వినాయక చవితి ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ నాగేంద్ర సూచించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో ఎస్‌ఐ సమావేశమయ్యారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఉత్సవాలను అందరి సహకారంతో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. విగ్రహాల ఏర్పాట్లకు పోలీసు, తహసీల్దార్, విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలన్నారు. మట్టి విగ్రహాలు పూజించాలని పిలుపునిచ్చారు. ఏఎస్‌ఐ ఇంద్రుడు, కానిస్టేబుల్ రాజశేఖర్, నాయక్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం



పత్తికొండటౌన్: వ్యాయామ ఉపాధ్యాయుడిగా శ్రీనివాసులు ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్దారని వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.రామచంద్రారెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ఎం.శ్రీనివాసులును శనివారం పత్తికొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో డివిజన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాలువా, పూలమాలలతో సత్కరించి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు ఎంతో మంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరేశప్ప, ఎంఈఓ రమేష్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు చందూనాయక్, రంగస్వామి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు వేళాయె

- చవితి సంబరాలకు మండపాలు సిద్ధం
- నిర్వహణకు పోలీసుల సూచనలు

పత్తికొండ రూరల్/ఎమ్మిగనూరు: వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. గణనాథుల ప్రతిమలను ప్రతిష్టించేందుకు మండపాలు సిద్ధం చేశారు. వివిధ అసోషియేషన్ల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో 25 చోట్ల భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు పోలీసుల అనుమతి తీసుకున్నారు. మండలంలోని పలు చోట్ల మరో 120 వరకు చిన్న, మధ్య తరహా సైజుల్లో విగ్రహాలను ప్రతిష్టించేందుకు యువత ఏర్పాటు చేసుకున్నారు. గత రెండు రోజుల నుంచి మండపాల అలంకరణ, విద్యుదీకరణ తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. గణనాథుడి మండపాల ఏర్పాటు, నిర్వహణ, నిమజ్జన సమయంలో పాటించాల్సిన నిబంధనలను ముందస్తుగా అధికారులు నిర్వాహకులకు తెలియజేశారు. 20వ తేదీన హంద్రీ-నీవా కాలువ వద్ద నిమజ్జనంతో వేడుకలు ముగుస్తాయి. ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకునేందుకు పోలీసు అధికారులు ముందస్తు సూచనలు చేశారు.

- వినాయక ఉత్సవాలను జరుపుకొనేందుకు ప్రజలు పూజా సామగ్రి, విగ్రహాల కొనుగోలుతో ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలో పండుగ సందడి నెలకొంది. భారీ విగ్రహాల ఏర్పాటులో ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలని, ఏమాత్రం పొరపాటుచేస్తే అందరూ ఇప్పందులె దుర్కోక తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య సోమవారం నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాలకు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. గ్రామగ్రామంలో సభల ద్వారా ప్రజలకు నిబంధనలు వివరిస్తున్నారు.



పత్తికొండలో పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న ప్రజలు



విక్రయానికి ఉంచిన వినాయక ప్రతిమలు





పత్తికొండలో భారీ వినాయక విగ్రహాన్ని లారీలో తరలిస్తున్న యువకులు, ఎమ్మిగనూరులో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

నిబంధనలు

- విగ్రహం ఏర్పాటుచేసే కమిటీలు తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలి.
- వివాదస్పద స్థలాలు, ట్రాఫిక్ అంతరాయం కలిగే ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయరాదు.
- విగ్రహాల వద్దగానీ, నిమజ్జనం సందర్భంగా గానీ అశ్లీల ప్రదర్శనలు, నృత్య ప్రదర్శనలు చేయరాదు.
- మైక్ పర్మిషన్ పొంది అందులోని నిబంధనలకు కట్టుబడాలి
- విద్యుత్‌శాఖ అనుమతితో తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు పొందాలి.
- బలవంత (చందాలు) వసూళ్లకు పాల్పడ కూడదు.
- నిమజ్జన సమయంలో కొత్తవారుగానీ, అనుమానిత వస్తువులుగానీ కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- విగ్రహాల వద్ద, నిమజ్జనం సందర్భంగా మత్తు పదార్థాలు సేవించరాదు.
- నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి.
- విగ్రహాల వద్ద కమిటీ సభ్యులే రక్షణగా ఉండాలి.
- విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేసేది. ఎప్పుడు నిమజ్జనం చేసేది పోలీసులకు కచ్చిత సమాచారమివ్వాలి.
- విద్యుత్ కనెక్షన్లపై అప్రమత్తంగా ఉండాలి.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

తుగ్గలి: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంఈఓ-2 రామ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష రుసుము జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50చెల్లించాల్సి ఉంటుందన్నారు. డిసెంబర్ 3న పరీక్ష ఉంటుందన్నారు.

20 నుంచి ఉచిత కంటి చికిత్స

మద్దికెర: అమెరికాకు చెందిన డాక్టర్ ప్రేమసాగర్ రెడ్డి, డాక్టర్ వెంకమ్మ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 29వ తేదీ వరకు స్థానిక ఫ్రెండ్స్ విద్యానికేతన్ హైస్కూలులో ఉచిత కంటి పొర చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు విజయ ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మురళీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. అర్థగేరి రామకృష్ణారెడ్డి, రుక్మిణమ్మ జ్ఞాపకార్థం శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శంకర్ నేత్రాలయ వైద్యులతో 20 నుంచి 26వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కంటి పరీక్షలు చేస్తారని, అలాగే 24 నుంచి 28 వరకు అవసరమైన వారికి కంటి పొర శస్త్రచికిత్సలు చేస్తారని తెలిపారు. చికిత్సకు వచ్చే వారు ఆధార్‌కార్డు, సెల్ నెంబర్ తీసుకురావాలన్నారు. వివరాలకు 63805 15583, 98400 87389 నంబర్లను సంప్రదించాలన్నారు.

నీటి సౌకర్యం కల్పించండి

మద్దికెర: మద్దికెరలోని కొండమ్మబావి వద్ద జగనన్న కాలనీలో నీటి సౌకర్యం కల్పించాలని గృహ నిర్మాణ లబ్ధిదారులు కోరుతున్నారు. ప్రభుత్వం పట్టాలు ఇవ్వడంతో ఇంటి నిర్మాణాలు చేపట్టామని అయితే నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. నీటి కోసం అదనపు భారం పడుతోందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే బోర్లు వేయిస్తే త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటామన్నారు.

బీడు భూముల్లో డీపీఎం పద్ధతిలో సాగు

వెల్దుర్తి: నీటి వనరులు తక్కువగా ఉండి బీడు భూములుగా వదిలేసిన పొలాలలో డీపీఎం (డ్రాట్ ప్రూఫింగ్ మోడల్) పద్ధతిలో తక్కువ పెట్టుబడితో పంటల సాగు చేయవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ ఎస్‌డీఏ మాబువలి తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల పరిధిలోని సర్పరాజాపురం గ్రామంలో రామళ్లకోట యూనిట్ ఎంటీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రైతు పూజారి శివన్నకు చెందిన 50 సెంట్ల బీడు పొలంలో డీపీఎం పద్ధతిలో విత్తనాలు నాటారు. ఈ సందర్భంగా ఎస్‌డీఏ మాట్లాడుతూ డీపీఎం పద్ధతిలో ఆముదం, కంది, గోరు చిక్కుడు, అనుములు, అలసంద, సజ్జ ఇలా విత్తనాలను ముందుగా బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. దేశీ ఆవు పేడతో తయారు చేసిన ఘన జీవామృతాన్ని విత్తనాలకు కలిపి నిర్ధేశించిన మూడడుగుల వెడల్పు, ఒకడుగు విస్తీర్ణంలో మధ్య విత్తు సాగుకు నాలుగు దిక్కులలో జిగ్‌జాగ్‌గా 5 రకాల విత్తనాలు నాటుకోవాలన్నారు. సూదేపల్లె యూనిట్ ఇన్‌ఛార్జ్ జనార్ధన్, ఐసీఆర్‌పీలు రామచంద్రుడు, శివకృష్ణ, కళ్యాణి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



డీపీఎం పద్ధతిలో బీడు భూమిలో విత్తన సాగును చూపుతున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

కస్తూర్బా పాఠశాల్లో ఏపీసీ పరిశీలన



పాఠశాల సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏపీసీ వేణుగోపాల్

దేవనకొండ: స్థానిక కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను ఆదివారం ఏపీసీ డాక్టర్ వేణుగోపాల్, జీసీడీఓ కే.సునీత సందర్శించారు. శనివారం కస్తూర్బా పాఠశాలలో కొందరు విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలైన ఘటనపై విచారణ చేపట్టారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురైందని, రెండు రోజులుగా బోరు నీటిని తాగుతున్నామని విద్యార్థినులు చెప్పారు. పాఠశాలలో మొత్తం 240 మంది విద్యార్థులు ఉన్నారని ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. క్యాంపస్ శుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని ప్రిన్సిపాల్, సిబ్బందిని ఆదేశించారు. ప్రతి పది రోజులకోసారి వాటర్ ట్యాంకును శుభ్రం చేయాలన్నారు. ఎంపీడీఓకు సమాచారం అందించగా వారు కూడా స్కూల్‌ని సందర్శించడం జరిగిందన్నారు. ఏఎన్‌ఎంలకు, పీహెచ్‌సీ సిబ్బందికి సమాచారం అందించగా వచ్చి మెడికల్ క్యాంపు నిర్వహించారు. అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మెడికల్ క్యాంపు సిబ్బంది తెలియజేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్, ఏఎన్‌ఎంపై చర్యలు తీసుకుంటామని ఏపీసీ వెల్లడించారు.

- కేజీబీవీ విద్యార్థుల ఆరోగ్య స్థితిపై ఆదివారం జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ ఆరా తీశారు. ఆయన ఆదివారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మంత్రి గుమ్మనూరు జయరాం కేజీబీవీ ప్రిన్సిపాల్ సుమిత్రతో ఫోన్‌లో మాట్లాడి విద్యార్థినుల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకొని వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

ఘనంగా విశ్వకర్మ జయంత్యుత్సవం



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగడు, ఎంపీపీ నారాయణదాసు



పత్తికొండలోని బ్రహ్మంగారి దేవాలయంలో విశ్వకర్మ జయంతిలో విశ్వబ్రాహ్మణులు



ఆస్పరిలో విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

పత్తికొండ రూరల్: పత్తికొండలోని విశ్వ బ్రాహ్మణులు విశ్వకర్మ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాతపేటలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మంద్ర స్వామి దేవాలయంలో విశ్వకర్మకు ఆలయ అర్చకుడు బ్రహ్మయ్యాచారి, శరభయ్యాచారి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశ్వబ్రాహ్మణులు పట్టణంలో బైక్ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కమ్మర హరికృష్ణ, సంఘం తాలుకా అధ్యక్షుడు శంకరయ్యాచారి మాట్లాడుతూ నాడు దివంగత మహానేత వైఎస్సార్ విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేస్తే నేడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశ్వకర్మ జయంతిని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా నిర్వహించాలని జీఓ నంబర్ 24 జారీ చేసి విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం జరిగిందన్నారు. కేంద్రప్రభుత్వం విశ్వకర్మ యోజన పథకాన్ని తీసుకురావడం సంతోషదాయకమన్నారు. ఆ సంఘం నాయకులు క్రిష్ణయ్యాచారి, పరమేష్‌ఆచారి, మహానంది ఆచారి, కాలయ్యాచారి, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: ఆస్పరిలో ఆదివారం విశ్వకర్మ చిత్ర పటానికి పూజలు చేశారు. అనంతరం బీజేపీ నాయకులు ప్రధానమంత్రి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బీజేపీ పార్టీ నాయకులు వెంకటరాముడు, వీరేష్, మునిస్వామి, మౌనేష్ ఆచారి, వీరేష్ ఆచారి, సోమేష్ ఆచారి, మురళీ యాదవ్ పాల్గొన్నారు.

హొళగుంద: స్థానిక దేవమ్మ ఆలయంలో విశ్వకర్మ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన విశ్వకర్మ బ్రాహ్మణులు పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్య అతిథిగ హాజరైన రాష్ట్ర బీజేపీ సెక్రటరీ అడ్వకేట్ సావిత్రిని పార్టీ మండలాధ్యక్షుడు ప్రసాద్, జిల్లా సెక్రటరీ సుధ, మండల ఉపాధ్యక్షుడు రామలింగ తదితరులు ఘనంగా సత్కరించారు.

పత్తికొండటౌన్: ఈ సృష్టిలో ఉన్న వాటిని బ్రహ్మదేవుడి ఆశీస్సులతో నిర్మించిన విశ్వకర్మ అందరికీ పూజ్యనీయుడని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.శ్రీరంగడు, ఎంపీపీ ఎం.నారాయణదాసు అన్నారు. విశ్వకర్మ జయంతి వేడుకలను ఆదివారం పత్తికొండ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎంపీటీసీ నీలకంఠ, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాముకాటుకు పనిచేయని నాటు వైద్యం

- కడివెళ్ల గ్రామంలో యువకుడి మృతి



మృతి చెందిన నరసింహులు (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో పాముకాటుకు గురైన వ్యక్తి నాటు వైద్యం తీసుకోగా కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన నరసింహులు, భార్య ఉరుకుందమ్మ, పిల్లలు సుజాత, మనోజ్, చిన్నారిలు శనివారం రాత్రి భోజనం చేసి ఇంట్లో పడుకున్నారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నరసింహులు (30)ను పాముకాటు వేయడంతో మెలకువ వచ్చి చూడగా పాము వెళ్లడం చూసి భయంతో కేకలు వేశాడు. భార్య పిల్లలు నిద్రలేచి, ఇంటి పక్కనున్న బంధువులను నిద్రలేపడంతో మంత్రాలయం మండలం కల్లుదేవకుంటలో పాము కాటుకు నాటు వైద్యం అందిస్తుండడంతో అక్కడికి వెళ్లారు. నాటు వైద్యం పొందిన తర్వాత పరిస్థితి విషమించడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో కోడుమూరు మండలం వర్కూర్ వద్ద నరసింహులు ప్రాణాలు వదిలాడు. నాటు వైద్యుడిని సంప్రదించకుండా ముందుగానే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి ఉంటే తన భర్త ప్రాణాలతో ఉండేవాడని మృతుడి భార్య, పిల్లలు బోరున విలపించారు. మృతదేహాన్ని గ్రామానికి తరలించారు.

ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

మద్దికెర: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం మధుబాబు ఆదివారం తెలిపారు. ఈనెల 29 నుంచి నెల రోజుల పాటు ఇచ్చే శిక్షణకు 18 - 45 ఏళ్లలోపు యువత అర్హులన్నారు. శిక్షణ సమయంలో ఉచితంగా భోజనం, వసతి కల్పిస్తారన్నారు. వివరాలకు సంస్థ డైరెక్టర్ శివప్రసాద్ 63044 91236 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



ఎమ్మిగనూరులో దీక్షకు సంఘీభావం తెలుపుతున్న దళిత ప్రజా సంఘాల నేతలు

ఎమ్మిగనూరు: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు చేపట్టాలని ఏపీ మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ్ మాదిగ, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు బి జయాకర్‌లు డిమాండ్ చేశారు. మాదిగల హక్కులు, వర్గీకరణ బిల్లు సాధన కోసం ఎమ్మిగనూరులో జరుగుతున్న రిలే దీక్షలను ఆదివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. మాదిగజాతి అభ్యున్నతి, ఆర్థిక పురోగతి ఎస్సీ వర్గీకరణ ద్వారానే సాధ్యమని వారు తెలిపారు. వర్గీకరణ బిల్లు కోసం ఈనెల 22న జరిగే ఛలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. మాదిగ న్యాయవాదుల ఫెడరేషన్ జాతీయాధ్యక్షుడు వెంకటరత్నం, అడ్వకేట్లు జయన్న, చార్లెస్, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు ఆనంద్ చైతన్య, ఎంసీ రామన్న, తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహాదేవ్ డిమాండ్ చేశారు. గోనెగండ్లలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం దీక్ష చేపట్టారు. మండలం బేడ, బుడగ జంగాల హక్కుల పోరాట సమితి నాయకులు నాగేష్, రాముడు, నరసింహుడు, ఉరుకుందు తదితరులు దీక్షకు మద్దతు తెలిపారు. ఆయా సంఘాల నాయకులు మునిస్వామి, నాగరాజు, కైలు, హనుమంతు, శివ తదితరులు పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు

మద్దికెర: మండలంలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ సుహాసిని, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు అన్నారు. మరమ్మతులకు గురైన బోర్లను ఆదివారం బాగు చేయించారు. బస్టాండు వద్ద ఉన్న బోరు, గ్రామానికి నీరందించే బోరు మరమ్మతులకు గురికావడంతో వెంటనే బాగుచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామంలో ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే తెలియజేయాలని ప్రజలను కోరారు.

గంగమ్మకు పూజలు



బొందిమడుగుల చెరువులో గంగ పూజ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బొందిమడుగుల చెరువులోని హంద్రీ నీవా రిజర్వాయర్ నీరు పారుతున్న సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే చెరువులో చీర, రవికె, పసుపు, కుంకుమ సమర్పించి గంగ పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కలను ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. హంద్రీ నీవా నీటి మళ్లింపుతో రైతుల చిరకాల వాంఛ నెరవేరుతోందన్నారు. నియోజకవర్గంలోని వేలాది ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం రుణమాఫీతో పాటు, చెరువులకు నీటిని మళ్లిస్తామని చెప్పి రైతులను మోసం చేసిందన్నారు. ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెరువులకు నీటిని మళ్లించే పథకాన్ని ప్రారంభించనున్నారని, రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మునిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సుంకన్న, సచివాలయ కన్వీనర్లు ఈశ్వర రెడ్డి, రంగారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సాగునీటిపై రగడ



ఆయకట్టు-నాన్ ఆయకట్టు రైతుల వాగ్వాదం

ఆలూరు: చిప్పగిరి మండలంలోని ఏబీసీ కెనాల్ ఆయకట్టు రైతులు-నాన్ ఆయకట్టు రైతుల మధ్య పైర్లకు నీరు పెట్టుకునే విషయంపై ఘర్షణలు తలెత్తాయి. ఏబీసీ కెనాల్ పరిధిలోని చిప్పగిరి, డేగులపాడు, ఏరూరు, మల్లికార్జునపల్లి, రామదుర్గం, బెల్డోణ, నగరడోణ, తిమ్మాపురం తదితర గ్రామాల పరిధిలోని ఆయకట్టు దాదాపు 14,500 ఎకరాలకు 250 క్యూసెక్కుల నీటిని 19 డీపీల ద్వారా విడుదల చేయాలని అధికారులు 1972లో నిర్ణయించారు. అయితే కాలువ పటిష్టత కోల్పోవడం కారణంగా లీకేజీలు, పెరిగిపోయిన జంగల్, డీపీలు శిథిలావస్థకు చేరుకోవడం కారణంగా కేవలం 50 నుంచి 80 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల అవుతోంది. ఆయా గ్రామాల్లో పంటలు సాగు చేసిన రైతులకు మాత్రమే పైర్లకు నీరు పెట్టుకునేందుకు అనుమతి ఉంది. అయితే కెనాల్ నీటిని వాడుకునే అనుమతి లేకున్నా చాలా మంది రైతులు అక్రమంగా మోటార్ల ద్వారా నీటిని పొలాలకు మళ్లించుకుంటున్నారని 6, 7, 8, 9 డీపీల పరిధిలోని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆయకట్టు, నాన్‌ఆయకట్టు రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయం చిప్పగిరి పోలీసు స్టేషన్ వరకు వెళ్లింది. స్టేషన్ ముందు రెండో రోజు రైతులు వాగ్వాదానికి దిగడంతో పోలీసులు సర్దిచెప్పారు. ఈ సందర్భంగా ఏబీసీ కెనాల్ ఏఈ తిమ్మారెడ్డి మాట్లాడుతూ.. ఆయకట్టు రైతులు సాగు చేసిన పంటలకు నీటి తడులు పూర్తయితే తప్పా నాన్‌ఆయకట్టు రైతులు నీటిని మళ్లించుకునేందుకు అవకాశం లేదన్నారు.